ఇల్లరికం వెళ్ళాలని
సరదాపడిన
అతనికోరిక నెరవేరిందా?

జి.యస్.వి.వి
రమేష్
కథ

# ఇల్లరికపుటల్లుడు

ఇల్లరికం వెళ్లాలని మా రూమ్మేట్ శంకర్రావు ఎప్పటినుంచో సరదా పడుతుండేవాడు. వాడి కోరిక ఇన్నాళ్ళకు తీరబోతోంది. మిలటరీలో పనిచేసి రిటైరైన సుందరామ్మూర్తిగారి ఏకైక పుత్రికారత్నం మెల్లకన్ను మీనాక్షికి మొగుడుగా వచ్చేనెల ఒకటినుండి కొత్త అవతారం ఎత్తబోతున్నాడు.

ఇల్లరికం పోతే చులకనైపోతావురా వెధవా అని మా రూమ్మేట్లలందరూ చెప్పినా విని చస్తేనా.

అత్తారింట్లో అలుపూ సొలుపేముందు నోయ్

పంటూ తింటూ తిరిగేస్తుంటే
పనీ పాటా ఏముందునోయ్

అంటూ ఓ చచ్చు కవిత చెప్పి మా నోరు మూయించేవాడు. పోన్లే ఇన్నాళ్లకు వాడి కోరిక తీరింది కదాఅని ఆనందించాం. రాయలసీమకు రిజర్వేషన్ చేయించుకుని అందరం వాడి పెళ్ళికి ఒకరోజు ముందుగా తిరుమల చేరుకున్నాం.

వెళ్ళగానే వాళ్ళ తమ్ముడిని తోడిచ్చి విడిదింట్లో వున్న తన కాబోయే శ్రీమతిని చూసి రమ్మని పంపించాడు శంకర్రావు మమ్మల్నందరినీ. అందరం పోలోమని వెళ్లాం.

మేం వెళ్లేసరికి పెళ్ళికూతురు పూలు కట్టుకుంటూ

హే పావురమా పోపో
మా వారిని తేతే

అంటూ పాడుతోంది

ఫర్లేదురోయ్ కవిత్వంలో మనవాడికి సరిపోయింది అంటూ మా రాంబాబుగాడు ఓ పదిమార్కులు వేవేసాడు. మమ్మల్ని



అందరినీ గుంపుగా చూసేసరికి కొద్దిగా ఉలిక్కిపడ్డట్టు ఉంది. నమస్కారం చెల్లాయ్ మేము శంకర్రావుకి చాలా దగ్గర స్నేహితులం అంటూ మా అంజిగాడు పరిచయం చేసేసుకున్నాడు.

అయ్ నమస్కారమండే అంటూ తల కొద్దిగా పైకెత్తి నవ్వింది. ఈసారి ఉలిక్కిపడడం మా వంతు అయింది. కను కొట్టినట్టు

అనిపించింది. నాది అనుమానమేమో అనుకున్నాను. కానీ మావాళ్లందిరకీ మొహాలు పాలిపోవడం గమనించాను. ఏదో నాలుగు ముక్కలు మాట్లాడి బయటపడ్డాం.

బయటకొచ్చాక శంకర్రావు తమ్ముడు చెప్పాడు. వదినకు కొద్దిగా మెల్లకన్ను అని. అమ్మయ్యా అనుకున్నాం. "మరి అయ్ నమస్కారమండే ఇదేం భాషోయ్ మీ వదినది కొంపదీసి ఆదిలాబాద్ అడవుల నుండి రాలేదుకదా" ఉండబట్టలేక అడిగేసాడు మా కోతిగాడు.

అబ్బే లేదండి. ఏదో కాస్త కంగారు పడినట్లుంది. అంతే అంటూ సర్దిచెప్పాడు మా శంకర్రావు తమ్ముడు. మొత్తానికి శంకర్రావు పెళ్లి చాలా ఘనంగా జరిగిపోయింది. మేము తిరిగి వెళ్ళిపోయేముందు మా శంకర్రావుని ప్రక్కకు పిలిచి కొన్ని హితవచనాలు పలికాము.

ఒరేయ్ బడుద్దాయ్ పెళ్ళి అయిపోయిందని సంబరపడమాకు. ఇల్లలకగానే పండుగ గాదు. నీ లేకి బుద్దులు మార్చుకుని చావు. అన్నట్లు నీ సంసారం సుఖంగా వుండడానికి ఈ సూత్రాలు పాటించి చావు అంటూ కొన్ని సూత్రాలు ఏకరువు పెట్టాము.

1. ఇల్లరికం కదాని ఏది పడితే అది చేయించుకుని కక్కుర్తి వెధవలా తినమాక.

2. సిగరెట్టుకీ, వక్కపొడికి మీ మామ గారి దగ్గర డబ్బులు అడగమాక.

3. మీ ఆవిడని హోటళ్ళకి తీసుకెళ్ళినప్పుడు మరీ పిసినారి వెధవాల వన్‌బైటూ చాయ్ అంటూ చెప్పక కనీసం ఒక గోల్డ్‌స్పాట్ అయినా ఇప్పించు (ఇది ఎందుకు చెప్పేమంటే మా పుట్టిన రోజులకి చికెన్ బిర్యాని అడిగి మరీ తినే ఆ వెధవ తన వంతు వచ్చేసరికి త్రీ బైఫైవ్ చాయ్ ఇప్పిచ్చేవాడు)

4. శుభ్రంగా మేసాక బిల్లు మీ ఆవిడని ఇవ్వనివ్వకు. ఏదోదాంట్లో దీంట్లో మిగుల్చుకున్నది పోగుచేసి నువ్వే కట్టు.

5. మరీ ఎడ్డి వెధవలా మీ మామ ఏ పని చెబితే ఆ పని చేయమాకు.

6. పండగలకీ పబ్బాలకీ కాస్త బెట్టు చేస్తూ వుండు.

7. మరీ ఇంట్లోనే తిని కూర్చోక ఫ్రెండ్స్ ఉన్నారు అని గ్యాస్‌కొట్టి ఏ సినిమా హాలులోనే కూర్చుని కాలక్షేపం చేయి.

8. అస్తమానూ మీ మామగారి ఇనుప సామాను కొట్లో నువ్వే కూర్చోక. అప్పుడప్పుడు మీ మాంగారిని కూడా కూర్చోబెట్టు. వీలైతే షిఫ్టుల్లో పని చేయండి.

9. వచ్చిన అతిధులందరికీ ఇల్లరికపు అల్లుడైనా పెత్తనమంతా ఇతనిదే అనిపించేట్లు ఉండు.

10. నీ చచ్చు కవితలు కనిపించిన ప్రతివాడికి వినిపించకు.

చూడరా అబ్బాయి ఈ దశసూత్రాలు నువ్వు పాటిస్తే నీ సంసారం స్వర్గతుల్యం అవుతుంది. లేదా సంసారం ఒక చదరంగం అంటూ జీవితాంతం పాడుకోవలసిందే అని కూడా చెప్పాము.

చాలా థేంక్స్‌రా మీ దశసూత్రాలను తప్పకుండా దశలవారీగా అమలుచేస్తాను. నా జీవితాన్ని స్వర్గమయం చేసుకుంటాను అం

టూ ఆవేశంగా మా చేతుల్లో చేయి వేసి చెప్పాడు.


అందరం టాటా చెప్పి రైలెక్కాం. వాడిమీద జోకులు వేసుకుంటూ కాలాన్ని గడిపేసాము. తెల్లారేసరికి హైదరాబాద్ వచ్చేసాము.

కాలచక్రం గిర్రున తిరిగింది. అందరం జీవితాల్లో స్థిరపడ్డాము. దాదాపు ఇప్పటికే శంకర్రావు పెళ్ళి జరిగి పది సంవత్సరాలు అయింది. మా అందరి మధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి. ఒకరి క్షేమం ఇంకొకరికి తెలుస్తోంది. కానీ శంకర్రావు నుండి ఒక్క ఉత్తరం లేదు ఈ పది సంవత్సరాల నుండి కూడా. పది సంవత్సరాల తరువాత మేమందరం మేము చదువుకున్న వరంగల్‌లోని అశోకా లాడ్జ్‌లో ఫలానా రోజు కలుసుకుందాము అని ప్లాను వేసుకుని దాన్ని అమలు చేసాము. ఫలానారోజు కలుసుకుందాము పది సంవత్సరాల తరువాతకదా చూడడం తప్పక రమ్మని మా శంకర్రావుగాడికికూడా ఓ ఉత్తరం పడేసాము.

అనుకున్నట్లే అందరం అశోకాలో కలిసాము. ఒకర్నొకరు పది సంవత్సరాల తరువాత చూసుకోవడం, చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. అమలాపురం నుండి అంజిగాడు, రాయవెల్లూరు నుండి రాంబాబు, కొత్తగట్టు నుండి కొండిగాడు, ఖమ్మం నుంచి చంద్రం అందరూ వచ్చారు ఒక్క శంకర్రావు తప్ప. ఈ విషయం మా అందరిలో పెద్ద చర్చ అయింది.

కొంపదీసి మనాడు టపా కట్టెయ్యలేదు కదా అంటూ మా కోతిగాడు తన కోతిబుద్ధి బయట పెట్టుకున్నాడు. ఓరి వెధవ ఇంకా నీ భాష మారలేదు కోతిగాడివనిపించుకున్నావు అంటూ అందరం నవ్వుకున్నాము.

చివరకు అందరం శంకరంగాడి ఉనికి తెలుసుకోవడానికి వాళ్ళ మాంగారి ఊరు ఏలూరు బయలుదేరాము. ఈస్ట్‌కోస్ట్‌కి వెళ్ళి మధ్యాహ్నం మూడయ్యేసరికి ఏలూరులో దిగాము.



మొత్తం ఆరుగురం నేను, అంజి, కొండి, కోతి, చంద్రం, రాంబాబు భుజాలకు సంచులేసుకుని తిన్నగా పాత బస్టాండులోని ఇనుప సామాను కొట్టుకు చేరుకున్నాం. ఎవరో ఒకావిడ కుర్చీలో కూర్చుని ఏదో దీక్షగా రాసుకుంటోంది, బాగా లావుగా వుంది.

మాకు అనుమానం వచ్చింది మా సన్నాసిగాడు ఈ కొట్టును ఎవరికో అమ్మేసి వుంటాడు అని.

ఎందుకైనా మంచిదని మా కోతిగాడు దగ్గరకివెళ్లి అడిగాడు ఏవండీ ఇది శంకర్రావు గారి కొట్టేనా అని?

కాదు అంటూ తలెత్తింది ఆవిడ. ఒక్కసారి ఉలిక్కిపడ్డాం మేం. అదే కన్నుకొట్టడం సరిగ్గా పది సంవత్సరాల క్రితం కూడా. ఇది మీనాక్షి ఇనుప సామాను కొట్టు బయట బోర్డు కనిపించడంలేదా అవున్కు ఇంతకీ తమరెవరు? గడగడా అడిగేసింది. ఆ అడగడంలో సున్నితత్వం లేదు. పైగా కావాలని తెచ్చుకున్న కరుకుదనం వుంది.

అమ్మదీని మొహం మండా మంచి టెంపర్‌లా వుంది అంటూ మా అంజిగాడు నా చెవిలో గొణిగాడు.

ష్ అంటూ నేను వాడిని దూరంగా తీసికెళ్ళా. గుర్తు పట్టలేద్రటా వెధవా ఆవిడెవరనుకున్నావ్ మన శంకరంగాడి భార్య. అట్టే పేలమాకు అంటూ చిన్న సైజు వార్నింగిచ్చాను.

ఈలోగా మా రాంబాబు అడిగాడు మమ్మల్ని గుర్తుపట్టలేదా చెల్లాయ్ మీ పెళ్ళికి వచ్చాము. అన్నట్లు శంకరం బయటకెళ్లాడా ఇంటికెళ్లండి అక్కడున్నారు అంటూ విసురుగా సమాధానం చెప్పి మరలా తన పనిలో మునిగిపోయింది. ఆవిడ ప్రవర్తనకు కాస్త బాధపడ్డా ఏదో ఇంట్లో గొడవ అయ్యుంటుందిలే మూడ్ బాగున్నట్లు లేదు అని సర్ది చెప్పుకుని వసంతమహల్ దగ్గరున్న వాడి ఇంటికి దారితీసాము.

తిన్నగా వాడింటికివెళ్ళి తలుపు కొట్టబోయాము. లోపలినుంచి చిన్నగా పాట వినిపిస్తోంది

లాలిజో లాలిజో ఊరుకో పాపాయి
మువ్వగాని ఏడిస్తే
మీ అమ్మ నన్ను తిట్టేను

వార్నీ వీడు సొంత కవిత్వం మావనట్లు ఉంది అనుకుంటూ మరలా తలుపు కొట్టబోయాము. ఇంకో పాట వినిపించడంతో మా రాంబాబు నన్ను ఆపేసాడు ఆగవోయ్ ఏం పాడతాడో విందాం అంటూ.

బట్టలుతకగలను ఓ లలనా
అంట్లు తోమగలను ఓ లలనా
చీర కట్టగలను ఓ లలనా
చారు కాయగలను ఓ లలనా
పప్పు వండగలను ఓ లలనా
మనిషి బ్రతుకింతే ఓ లలనా

అంటూ ఇంకా ఏదో పాడబోయాడు. కానీ ఈలోగా ఉండబట్టలేని మా కోతిగాడు తలుపుకొట్టాడు.

ఆయ్ వస్తున్నాను అంటూ లోపలి నుండి వినిపించింది. అమ్మ వీడి భాష తగలడా మారిపోయినట్లున్నాడు. సంవత్సరం కాపురం చేస్తే వాడు వీడు వీడువాడు అవుతారట అనుకున్నాం నవ్వుకుంటూ.

తలుపు తీసింది ఓ ఆకారం. సన్నగా పీలగా వున్నాడు. నల్లగా కళ్లు పీక్కుపోయి రేపో మాపో అనేటట్లు వున్న ఆ ఆకారం మా శఙ్కరంది అని గుర్తు పట్టడానికి మాకు అట్టే సేపు పట్టలేదు. లాగు తప్ప వంటిమీద మరో బట్టలేదు. చంకలో బొద్దుగా వున్న ఓ పాప వుంది.

శంకర్రావుని ఆ స్థితిలో చూసేసరికి అందరికీ దుఃఖం ముంచుకొచ్చింది. మా కొండిగాడైతే శంకరాన్ని పట్టుకుని ఏమిట్రా ఇది అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

మొహాన చిరునవ్వు పులుముకుని మమ్మల్ని నవ్వించడానికి ఏవో జోకులు చెపుతూ కుశల ప్రశ్నలు వేస్తూ టీ కాచి పట్టుకొచ్చాడు మా శంకరం.

ఏరా వంట్లో బాగుండడంలేదా అడిగాను నేను.

శుభ్రంగా వుంది నా ఆరోగ్యం. ఇంకో వాలుగైదేళ్లు గ్యారంటీ అంటూ నవ్వాడు శంకర్రావు.

మరీ అవతారం ఏమిటి అడిగాడు కొండిగాడు.

అంతా భ్రాంతియేరా
ఇల్లరికం అంటే వాంతిలేరా

అంటూ కవిత్వం చెప్పబోయాడు శంకర్రావు. కానీ కొట్టేట్టు వున్న అంజిగాడి మొహం చూసి ఆగిపోయాడు. సరిగా చెప్పేడువు అంటూ గట్టిగా గదిమేడు అంజిగాడు.

ఏం చెప్పమురా బాబు ఇల్లరికం ఇల్లరికం అంటూ కలవరించానుగా దాని ఫలితం ఇది అంటూ ఒక్కసారిగా కళ్ళనీళ్లు పెట్టుకున్నాడు శంకర్రావు.

వాడిని ఆ స్థితిలో చూసేసరికి నిజం చెప్పొద్దు అందరికీ జాలేసింది.


ఏరా దశసూత్రాలు అమలుచేయలా? మా కోతిగాడు అడిగాడు.

చేసే అవకాశం రాలేదురా?

ఏం అంటూ అందరం ఆతృతగా కోరస్‌లో అడిగాం.

ఏం చెప్పమంటారు

1. వంట చేసేది నేనే కాబట్టి ఏది



గొప్పతనం

పార్కులో గోపీతో తన చెల్లెలు గొప్పతనం గూర్చి చెపుతోంది రాధ.
"మా చెల్లెలు రమ్యని నలుగురు ప్రేమిస్తున్నారు తెలుసా...!"
"మిగతా ముగ్గురు ఎవరో మరి!?" అడిగాడు గోపి.
"ఆ....!" అంటూ నోరెళ్ళబెట్టింది రాధ.

—సూర్య (వేగుంట)

పడితే అది చేసుకుని తినే ఓపిక చచ్చిపోయింది.

2. నేను సిగరెట్లు త్రాగి వక్కపొడి తింటే కనుక నేను ఫుల్‌బాటిల్ మందు కొడతానని మా ఆవిడ మొదటి రోజే అల్టిమేటమ్ ఇచ్చింది.

3. మా పెళ్లి అయినప్పటినుండీ ఎప్పుడూ మా ఆవిడ నన్ను హోటళ్ళకి తీసుకెళ్ళడమే కాని నేను తీసుకెళ్లడం జరగలేదు.

4. హోటల్‌కెళ్ళిన ప్రతిసారీ చల్లని మంచినీళ్లు ఇప్పించేది టీ త్రాగడం కూడా ఖర్చు దండగని. ఇక బిల్లు సంగతి ఎందుకొస్తుంది?

5. మా మేజర్ మాంగారు చెప్పింది చేయకపోతే ఫుడ్ గిడ్ బంద్.

6. పండుగలు పబ్బాలు అసలు జరగనే జరగవు. మొన్న దీపావళికి మా ఆవిడ, మా మాంగారు నేను కలిసి ఒక్క అగ్గిపెట్టె కాల్చాము.

7. ఇంట్లో పనులతోనే కుదరదు. ఇంక బయటకి వెళ్ళడం ఎలా?

8. ఇనుప సామాను కొట్లో మా ఆవిడ మా మాంగారు షిఫ్టుల్లో కూర్చుంటారు. ఇంట్లో నాది ఇరవైనాలుగు గంటల షిఫ్టు.

9. వచ్చిన అతిధులందరికీ కాఫీ, టిపిన్లు మోసే బాధ్యత నాదే. ఇక అదే నా పెత్తనం.

10. ఇక కవితల మాటంటావా. వినిపించడానికి నా దగ్గరకు ఎవరూరారులే. ఏదో నాలో నేను గొణుక్కోవలసిందే.

అంటూ దశసూత్రాల ఫలితాలు ఏకరువు పెట్టాడు మా శంకర్రావు.

ఔరా అని మేమందరం ముక్కు మీద వేలేసుకుని అడిగాము ఓ ఉద్యోగం కోసం చూడకపోయావా అని అడిగాం.

ఆ ఆ ముచ్చటా తీరింది. తంబి దర్బార్ బత్తి ఫ్యాక్టరీలో క్లర్క్‌గా ఉద్యోగం వచ్చింది. తెల్లారే మా మాంగారు పైరవీ చేయించి నా ఉద్యోగం ఊడగొట్టించాడు.

అబ్బా అంత పలుకుబడా మీ మాంగారికి ఆశ్చర్యంగా అడిగాడు మా కొండల్రావ్. వాడికి అన్నీ ఆశ్చర్యమే. ఎవడన్నా వరుసగా నాలుగు తుమ్ములు తుమ్మితే అబ్బా ఈ ప్రపంచంలో నాలుగుసార్లు వరుసపెట్టి తుమ్మేవాళ్లు ఉన్నారా అంటూ ఆశ్చర్యపోతాడు

ఆ పలుకుబడికేం తక్కువలేదు. తెల్లారి లేస్తే మిలిట్రీలో ఇచ్చిన తుపాకీ పట్టుకుని

నేనే మేజర్ నెంబర్ వన్

నా పేరే సుందర్ సుందర్ అంటూ రోడ్లు చక్కబెడుతుంటాడు.

ప్చ్ ప్చ్ అంటూ అందరం పెదవి విరిచి

నందామయ గురుడ నందామయా
ఇల్లరికపు అల్లుళ్ళ బాధలు ఇంతేనయా

అనుకుంటూ మా శంకర్రావుని ఆఖరిసారిగా చూసి భారమైన హృదయాలతో గోదావరి ఎక్స్‌ప్రెస్‌ని అందుకోవడానికి బయలుదేరాము.